క్లుప్తంగా

వీఆర్వో కుటుంబానికి సాయం

కోడూరు: మండలంలోని పిట్టల్లంక వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన వాకా మరియదాసు కుటుంబ సభ్యులకు సహ ఉద్యోగులు ఆర్థిక సహాయం అందించారు. మృతుడి స్వగ్రామం నాగాయలంక మండలంలోని పెద పాలెం గ్రామంలో మరియదాసు మృత దేహాన్ని రెవెన్యూ సిబ్బంది ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది రూ.15 వేల నగదును కుటుంబ సభ్యులకు అందించారు. మృతుడి భార్య, కుమార్తెకు ధైర్యం చెప్పారు.

భద్రాద్రి రామాలయంలో హోమం



మచిలీపట్నంటౌన్: ప్రధాన రహదారిలోని భద్రాద్రి రామాలయంలో ఆదివారం 108 లడ్డూల వాహనం చేసి హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి దిట్టకవి శేషకృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



మచిలీపట్నంటౌన్: ఈడేపల్లి సత్యసాయి సేవా మందిరంలో ఆదివారం 25 పేద కుటుంబాల వారికి నిత్యావసర సరుకులను నిర్వాహకులు అందజేశారు. సత్యసాయి అమృత కలశ కార్యక్రమంలో భాగంగా నిత్యావసర సరుకులను అందజేయగా సత్యసాయి కుటుంబ నారాయణ సేవా కార్యక్రమంలో భాగంగా అన్నదానం చేశారు. సేవా సమితి కన్వీనర్ పోతుకూచి అంజనేయకుమార్, సమితి మహిళా విభాగం ఇన్చార్జి కాళికాదేవి, మహిళా సేవాదళ్ సమన్వయకర్త నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాలను ప్రదర్శించిన రైతులు



కోడూరు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమానికి మద్దతుగా రైతులు జాతీయ పతాకాలను ప్రదర్శించారు. మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో రైతులు ఆదివారం సాయంత్రం త్రివర్ణ పతాకాలను ప్రదర్శించారు. భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరిస్తూ నివాళులర్పించారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా

చల్లపల్లి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా ఆదివారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. పలువురు తమ ఇళ్లపై జాతీయ పతాకాలను ఎగురవేశారు. పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు పర్యవేక్షణలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది.

భక్తుల రద్దీ

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

వెండి వస్తువుల సమర్పణ

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారికి మచిలీపట్నానికి చెందిన ఆర్.వి.ఎస్.మురళీధర్, సృజనకుమారి దంపతులు వెండి వస్తువులను సమర్పించారు. ఆదివారం ఆలయ ఈఓ కానూరి సురేష్‌కు 1,200 గ్రాముల విలువైన వెండి నక్షత్ర హారతి, సర్ప హారతులను అందించారు. ఆ దంపతుల పేరిట అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

72 మందికి వైద్యసేవలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 72 మంది రోగులకు గుడివాడ వైద్యురాలు డాక్టర్ గవిర్నేని రజిని వైద్య పరీక్షలు చేశారు. లయన్స్ చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశామని పేర్కొన్నారు. అనంతరం లయన్స్ సేవాభవన్‌లో వంద మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన ఒరవడి



విద్యార్థులకు ఐఎఫ్‌పీ ప్యానల్‌పై విద్యాబోధన చేస్తున్న ఎంఈఓ



స్క్రీన్‌పై డిజిటల్ పాఠాలు చదువుతున్న విద్యార్థి

- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- ప్రభుత్వ బడుల్లో డిజిటల్ పాఠాలు
- బోధనలో సరికొత్త విధానానికి శ్రీకారం
- ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల ద్వారా విద్యార్థులకు బోధన
- ఆసక్తికరంగా పాఠాలు వింటున్న విద్యార్థులు

కోడూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ పాఠశాలల్లో సైతం లేని విధంగా సర్కారీ బడుల్లో దశల వారీగా డిజిటల్ బోధనను అందించేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. నూతన విధానం ద్వారా విద్యార్థులు పాఠాలను సులభతరంగా అర్థం చేసుకుంటున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలు, 3 నుంచి పదో తరగతి వరకు స్మార్ట్ టీవీలతో పాటు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) ద్వారా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఉచితంగా అందజేసి అత్యాధునిక బోధనను అందిస్తున్నారు.

బ్లాక్ బోర్డులకు స్వస్తి..

డిజిటల్ బోధన పూర్తిగా అందుబాటులోకి వస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చాక్ పీసులకు కాలం చెల్లుతుంది. ఇప్పటికే కోడూరు మండలంలోని రామకృష్ణాపురం ఎంపీయూపీ, స్వతంత్రపురం జెడ్పీ, విశ్వనాథపల్లి ఎంపీయూపీ, కోడూరు జెడ్పీ పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేశారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా ఉపాధ్యాయులు బోధన కూడా ప్రారంభించారు. ఇప్పటికే మండలానికి తొమ్మిది ఐఎఫ్‌పీ ప్యానల్స్, నాలుగు స్మార్ట్ టీవీలను కూడా కేటాయించారు. డిసెంబర్ నాటికి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వీటిని అందించనున్నట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలతో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలను వీటి ద్వారా బోధిస్తున్నారు.

బోధన సులభతరం..

స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల వినియోగంపై ఉపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఇంటర్నెట్ అనుసంధానంతో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డును ఏ విధంగా ఉపయోగించాలి, స్మార్ట్ టీవీలో బోధించాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కొత్త విధానంలో ఒక్క క్లిక్‌తోనే విద్యార్థులకు అన్ని విషయాలను చూపించవచ్చు. సైన్స్, లెక్కల పాఠ్యాంశాల బోధన సమయంలో ఉపాధ్యాయులు బోర్డుపై కొన్ని బొమ్మలు వేయాల్సి ఉంటుంది. అయితే బ్లాక్ బోర్డుపై బొమ్మను రూపు తీసుకువచ్చేందుకు చాలా సమయం పడుతుంది. ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా బొమ్మలను సైతం సులభతరంగా వేసేందుకు అవకాశం ఉంది. గతంలో బోధించిన పాఠ్యాంశాలపై విద్యార్థులకు సందేహాలుంటే ఉపాధ్యాయులు వెంటనే వాటిని బోర్డుపై ప్రదర్శించి నివృత్తి చేయవచ్చు.



ఎక్కువకాలం గుర్తుంటుంది

ఐఎఫ్‌పీ విధానంలో విద్యార్థులకు కష్టతరమైన పాఠ్యాంశాలను సులభతరంగా వివరించవచ్చు. దీనికి తోడు దృశ్య, శ్రవణంతో పాఠ్యాంశాలు బోధించడం ద్వారా విద్యార్థికి ఎక్కువకాలం గుర్తుండే అవకాశం ఉంది. మండలంలోని నాలుగు పాఠశాలల్లో ఇప్పటికే తొమ్మిది ఐఎఫ్‌పీ ప్యానల్స్, నాలుగు స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ బోధనను నిర్వహిస్తున్నారు. మిలిగిన అన్ని పాఠశాలలకు డిసెంబర్ నెలాఖరు నాటికి వీటిని అందిస్తాం. విద్యారంగంలో ఇదొక విప్లవాత్మక మార్పుగా చెప్పవచ్చు.

– టీవీఎం రామదాసు, ఎంఈఓ, కోడూరు



విద్యార్థులలో ఆసక్తి పెరిగింది

విద్యా విధానంలో డిజిటల్ బోధన నూతన ఒరవడికి నాంది పలికింది. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా విద్యార్థులకు సమగ్రమైన విద్యాబోధన జరిపేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ విధానంతో భవిష్యత్తులో మంచి ఫలితాలొస్తాయి. మ్యాపులు, చిత్రాల ద్వారా చూపించే కొన్ని అంశాలను ఫొటోలతో చూపించేందుకు ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. విద్యార్థులు కూడా పాఠాలను శ్రద్ధగా వినడంతోపాటు మరిన్ని కొత్త అంశాలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– మన్నె ప్రేమ్‌చంద్, ఉపాధ్యాయుడు, రామకృష్ణాపురం ఎంపీయూపీ పాఠశాల



పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయి

స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా పాఠాలు వినడం కొత్తగా ఉంది. ఇలా చెప్పే పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయి. వీడియోలు, కదిలే బొమ్మల ద్వారా పాఠాలు బోధిస్తుండటంతో ఎక్కువకాలం గుర్తుంటున్నాయి. ఈ విధానం ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఉత్సాహం పెరిగింది. డిజిటల్ విధానం మాకందరికీ చదువుపై ఆసక్తి పెరిగేలా చేసింది.

– కె.ప్రహర్షిత, 8వ తరగతి, రామకృష్ణాపురం

జగనన్న చేసిన మేలు మరువలేం

- ఎస్టీ ఇళ్ల లబ్ధిదారుల ఆనందం
- సీఎం జగన్, ఎమ్మెల్యే సింహాద్రికి కృతజ్ఞతలు



కోసూరువారిపాలెంలో స్థలాల కేటాయింపుపై ఆనందం వ్యక్తంచేస్తున్న లబ్ధిదారులు

కోసూరువారిపాలెం(మోపిదేవి): స్థలం, ఇళ్లు కట్టించి సమాజంలో గుర్తింపు, గౌరవం కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు మేము ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం అంటూ యానాదులు(ఎస్టీ) వినయపూర్వకంగా చేతులు జోడించి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో యానాదులకు ప్రభుత్వం అందిస్తున్న పక్కా భవన సముదాయానికి స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలంలో ఆదివారం సాయంత్రం స్వచ్ఛందంగా మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తాతల కాలం నుంచి గ్రామాలకు దూరంగా కాలువగట్లపై గుడిసెలు వేసుకుని విష సర్పాలు, పురుగుల మధ్య జీవించేవారమన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మమ్మలను పట్టించుకోలేదని చెప్పారు. జగనన్న ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన అనంతరం మా సమస్యలు తెలుసుకుని ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించారన్నారు. అప్పటి నుంచి మాకూ రేషన్, పింఛన్ ఇస్తున్నారని తెలిపారు. ఇప్పుడు సొంతంగా స్థలం ఇవ్వడంతో పాటు పక్కా భవనాలు కూడా ప్రభుత్వం కట్టించడం వల్ల స్థానిక ఎమ్మెల్యే రమేష్‌బాబు, ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ ఏఈ రాజులపాటి తాండవకృష్ణ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్స్ కింద మండలానికి 1,070 గృహాలు మంజూరు కాగా ఇందులో యానాదులు 21 మందిని గుర్తించి వారికి ప్రభుత్వ పరంగానే గృహ నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇప్పటికే మోపిదేవిలో 9 భవనాలు ప్రారంభానికి సిద్ధం కాగా, కోసూరువారిపాలెంలో 10, వెంకటాపురంలో 2 భవనాలు నిర్మించాలని వివరించారు. సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, లింగం జగదీష్‌కుమార్, నందిగం అభిషేకరావు, మత్తి వెంకట సత్యనారాయణ, వీఆర్వో మోపిదేవి వెంకటేశ్వరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలకు నిరసనగా శాంతి ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జేఏసీ నాయకులు

పెడన: మణిపూర్ రాష్ట్రంలో హింసాత్మక ఘటనలకు నిరసనగా ఆదివారం సాయంత్రం పెడన పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని హిందువులు, క్రైస్తవులు, ముస్లింల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొని మణిపూర్ ఘటనలను ముక్తకంఠంతో ఖండించారు. ర్యాలీ పెడన మార్కెట్ యార్డు నుంచి పెడన మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జాతిపిత మహాత్ముని విగ్రహం వరకు సాగింది. సేవ్ మణిపూర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. షాపింగ్ కాంప్లెక్స్ వద్ద పలువురు వక్తలు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై కేంద్ర ప్రభుత్వం పెదవి విప్పకపోవడం దారుణమన్నారు. ఆ రాష్ట్రంలో శాంతి నెలకొల్పేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో వైఎస్సార్ సీపీ యువ నాయుడు జోగి రాజీవ్, మచిలీపట్నం ముస్లిం మైనార్టీ నాయుడు షేక్ సలార్‌దాదా, పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, పెనుమల్లి సర్పంచ్ రామానాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, టీడీపీ నాయకుడు బూరగడ్డ వేదవ్యాస్, సీపీఎం నాయకుడు సజ్జా నాగేశ్వరరావు, ఫాదర్ జోజిరెడ్డి, పాస్టర్లు డానియేల్, శామ్యూల్, ఇజ్రాయేల్, జాన్‌విల్సన్, మార్కు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన మహిళా మార్ట్



పెడనలో త్వరలో ప్రారంభం కానున్న చేయూత మహిళా మార్ట్



చేయూత మహిళా మార్ట్ లోపల నిత్యావసర సరుకులు, సిబ్బంది

జిల్లాలో పెడన మార్ట్ రెండవది

పెడన: మహిళల అభ్యున్నతికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇప్పటికే వారికి ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. మహిళా మార్ట్‌ల ద్వారా వారు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జగనన్న మహిళా మార్ట్ పేరుతో పూర్తిగా డ్వాక్రా మహిళలు నడిపేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డీఆర్‌డీఏ ద్వారా తగు చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 36 మహిళా మార్ట్‌లు ప్రారంభించారు. పెడనలో 37వ మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే భవన నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. ఇది కృష్ణా జిల్లాలో రెండవది. మొదటిది అవనిగడ్డలో ఏర్పాటు చేశారు.

సిబ్బంది నియామకం..

పెడన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారి పక్కన చేయూత మహిళా మార్ట్‌ను ఏర్పాటుచేశారు. ఇందులో ఒక మేనేజర్‌గా గూడూరు మండలానికి చెందిన సీసీకి బాధ్యతలు అప్పగించారు. మరో నలుగురు సిబ్బందిని నియమించారు. ఈ నలుగురిలో ఒకరు కంప్యూటర్ ఆపరేటర్, ముగ్గురు సపోర్టింగ్ స్టాఫ్. ఇప్పటికే సరుకులను పూర్తిస్థాయిలో డంప్ చేసి కంప్యూటరైజ్ చేస్తున్నారు. ఎంత సరుకు వచ్చింది, ఎక్కడ ఏ రకం సరుకు ఉందనే అంశాలపై సిబ్బంది శిక్షణ పొందుతున్నారు. బయటి నుంచి తీసుకువచ్చినవే కాకుండా డ్వాక్రా మహిళలు సొంతంగా తయారు చేసిన తినుబండారాలను ప్యాకింగ్ చేసి విక్రయించేలా చర్యలు చేపట్టారు. అప్పడాలు, వడియాలు, ఊర మిరపకాయలు, వివిధ రకాల పచ్చళ్లు చేయూత మహిళా మార్ట్‌లో విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఈ నెలాఖరులోగా ప్రారంభం

చేయూత మహిళా మార్ట్‌ను ఈ నెలాఖరులోగా ప్రారంభించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం సిబ్బంది శిక్షణలో ఉన్నారు. డ్వాక్రా మహిళలు స్వతహాగా తయారు చేసిన ఫుడ్ ఐటమ్స్‌ను కూడా మహిళా మార్ట్‌లో విక్రయించేలా చర్యలు తీసుకున్నాం. బయటి మార్కెట్ ధరల కంటే తక్కువకు ఇచ్చేలా, మహిళలను ప్రోత్సహించేలా డీఆర్‌డీఏ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తోంది.

– కనకారావు, ఏసీ, పెడన నియోజకవర్గం

ముమ్మరంగా వరి నాట్లు



ముంజులూరు గ్రామ పరిధిలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సార్వా నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గత నెలలో కురిసిన అధిక వర్షాలకు వెద పొలాలు, నారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు రెండోసారి నాట్లు వేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి నారు తీసుకువస్తున్నారు. మండలంలో సుమారు నాలుగు వేల హెక్టార్లలో వెద పద్ధతిన సాగు చేశారు. మిగిలిన వారు నాట్ల కోసం నారుమళ్లు పోసుకున్నారు. ఈ క్రమంలో అధిక వర్షాలకు పల్లపు భూముల్లోని నారుమళ్లు, వెద పొలాలు పూర్తిగా నీట మునిగి కుళ్లిపోయాయి. మండలంలో ఎక్కువ భాగం వెద పద్ధతి కావడంతో నారు కొరత తీవ్రంగా ఉంది. రైతులు అనేక వ్యయప్రయాసలు కోర్చి దూర ప్రాంతాల నుంచి నారు తీసుకువస్తున్నారు. తక్కువ రోజుల పంట కింద ఎంటీయూ 1121, 1153, బీపీటీ విత్తనాలను రైతులు వేసుకోవచ్చని ఏఓ శివరామకృష్ణ పేర్కొన్నారు. ఇప్పుడు దమ్ము చేసి నారుమళ్లు పోసినా సుమారు 130 రోజుల పంటగా కాల పరిమితి సరిపోతుందని ఆయన తెలిపారు. ఇప్పటికే ముంజులూరు, అర్తమూరు, ఆముదాలపల్లి, పెందుర్రు బ్రాంచి కాలువల పరిధిలోని రైతులు దమ్ములు చేస్తూ నాట్లు ముమ్మరంగా చేపట్టారు.

పెన్షన్ పథకాలను వినియోగించుకోండి



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ దుర్గారావు

మండవల్లి : అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరి ప్రతి నెలా రూ.10 వేలు గ్యారంటీ పెన్షన్‌తో వృద్ధాప్యాన్ని సురక్షితం చేసుకోవాలని స్థానిక ఇండియన్ బ్యాంకు మేనేజర్ బొంతు దుర్గారావు, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. మండలంలోని కానుకొల్లులో ఆదివారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సామాజిక పథకాలైన జీవనజ్యోతి, బీమా యోజన, పెన్షన్ యోజనపై ఆదివారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాస్టర్ కంతేటి థామస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. దుర్గారావు, భాస్కరరావు మాట్లాడుతూ 30 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న దంపతులు రెండు అకౌంట్‌లు తెరచి నెలకు రూ.577 చెల్లిస్తే 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.10 వేలు పొందవచ్చని తెలిపారు. నామినీకి రూ.17 లక్షలు చెల్లిస్తారని పేర్కొన్నారు. 18 ఏళ్ల వయస్సు వారు నెలకు రూ. 210, 35 వయస్సు అయితే రూ.902 చెల్లిస్తే సరిపోతుందన్నారు. వయస్సును బట్టి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పథకం కింద ఇన్వెస్ట్ చేసిన వారు పెట్టుబడిని బట్టి నెలవారీ పెన్షన్‌గా రూ.1000, రూ.5000 వరకు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఇంటి ఝూన్సీరాణి, జి.మహాలక్ష్మి, బి.కరుణ, దానియేలు, బి.సృజన, జి.గోవింద్, షడ్రక్ థామస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయ సంస్థ ఆవరణలో ఆదివారం నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు విశేష స్పందన లభించింది. వ్యాసరచన పోటీలకు హైస్కూల్ విభాగం నుంచి 136 మంది, కళాశాల విభాగంలో 34 మంది, వక్తృత్వ పోటీలకు పాఠశాల విభాగం నుంచి 34 మంది, కళాశాల విభాగం నుంచి 12 మంది మొత్తం 216 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. భారత స్వాతంత్య్ర సంగ్రామంలో మచిలీపట్నం పాత్ర అంశంపై వ్యాసరచన, భారత స్వాతంత్య్ర సంగ్రామం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వయోజన విద్య ఉప సంచాలకులు హాజీ బేగ్, మచిలీపట్నం చరిత్ర పుస్తక రచయిత మొహమ్మద్ సిలార్, హిస్టరీ ఫ్యాకల్టీ విజయభాస్కర్, విశ్రాంత అధ్యాపకుడు ఎస్. వెంకటేశ్వర్లు, వ్యాసరచన పోటీలకు ఉపాధ్యాయిని ఎం. అన్నపూర్ణమ్మ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సహాయ ఫౌండేషన్ చైర్మన్ ఎండీ ఉస్మాన్ బాషా, మహిళా విభాగం సభ్యులు నూర్జహాన్‌బేగం, లక్ష్మీకాంతం, జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

రామబుజ్జి కుటుంబానికి ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



మోపిదేవి: మోపిదేవిలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త అర్జా రామబుజ్జి కుటుంబ సభ్యులను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ఆదివారం పరామర్శించారు. రామబుజ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుమారులు అర్జా నాగరాజు, సుబ్రహ్మణ్యం, బాలాజీ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, గరికిపాటి వెంకటేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం 10 గంటలకు హుండీల్లో కానుకలను లెక్కిస్తామని ఆలయ ఈవో మాధవీలత ఆదివారం తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని, ఆసక్తి గల భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చని తెలిపారు. దేవస్థానంలో 21వ తేదీ వరకు వార్షిక ఆగమన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. 19న మూలవరులకు అష్టోతర శతకలశాభిషేకం, 20న లక్ష తులసి పుష్పాలతో అర్చన, 21న మూలవరులకు నవకళశాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు సమష్టి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

చదరంగంతో మానసిక వికాసం

టూటౌన్ సీఐ తులసీధర్

గుడివాడ టౌన్: చదరంగం మానసిక వికాసానికి దోహదపడుతుందని టూటౌన్ సీఐ తులసీధర్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఇన్‌డోర్ స్టేడియంలో ఆదివారం పాఠశాలల స్థాయి చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక దేశస్తులు ఆడే క్రీడ చదరంగం ఒక్కటేనన్నారు. చదరంగం ఆడటానికి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేరేపించాలన్నారు. ప్రపంచంలోని అన్ని క్రీడలకన్నా అతి తక్కువ ఖర్చుతో ఆడే క్రీడ ఇది ఒక్కటేనన్నారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు(చంటి) మాట్లాడుతూ చదరంగం క్రీడలో గుడివాడ ప్రత్యేకత సంతరించుకుందన్నారు. పట్టణానికి చెందిన కోనేరు హంపి, పిన్నమనేని సాహితి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన చరిత్ర పట్టణానికి ఉందన్నారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, కార్యవర్గ సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య, కిలారు రంగప్రసాదు, చింతా రఘుబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చేప బెల్లం ద్రావణం తయారీ

మండవల్లి: అల్లీనగరంలో చేప బెల్లం తయారీ విధానాన్ని డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ రైతులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ సాగులో ఖర్చులను తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండల ఇన్‌చార్జ్ నాగ విజయ, ఐసీఆర్పీ నాగవాణి, రైతులు పాల్గొన్నారు.